క్లుప్తంగా

నేడు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

షాద్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలోని ఎల్‌ఎస్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి సాయి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30గంటలకు నిర్వహించే ఈ సమ్మేళనానికి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

'చలో కలెక్టరేట్' విజయవంతం చేయండి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య

కొందుర్గు: ఈ నెల 10న నిర్వహించ తలపెట్టిన చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాల పంపిణీ, డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలనే డిమాండ్‌తో ఈ కార్యక్రమం చేపట్టామని వివరించారు. అన్ని వర్గాల పేదలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కరాటే మాస్టర్లకు శిక్షణ

కొందుర్గు: న్యూమాంక్స్ కుంగ్‌ఫూ అసోషియేషన్ ఆధ్వర్యంలో శనివారం కొందుర్గు కరాటే మాస్టర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్ పటేల్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రతీ ఒక్కరు యుద్ధ విద్యలో నైపుణ్యం సాధించాలన్నారు. మాస్టర్లు పాఠశాలల్లో విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కనకం యాదవ్, మాస్టర్లు రమేశ్, ఎయాపాషా పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్‌ఐ మెయిన్స్



కేజీరెడ్డి కళాశాలలో పరీక్ష సరళిని పరిశీలించి వస్తున్న డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

మొయినాబాద్: ఎస్సై మెయిన్స్ పరీక్ష శనివారం మొదటి రోజు ప్రశాంతంగా ముగిసింది. మండల పరిధిలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల, జేబీఐఈటీ, జేబీఆర్ఈసీ కళాశాలల్లో ఆదివారం ఎస్సై మెయిన్స్ పరీక్ష జరిగింది. ఆయా పరీక్ష కేంద్రాల్లో మొత్తం 3,084 మంది అభ్యర్థులకు గాను 3వేల మంది హాజరై పరీక్ష రాశారు. పరీక్ష కేంద్రాలను శంషాబాద్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, చేవెళ్ల ఏసీపీ ప్రభాకర్, మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ డీకే లక్ష్మీరెడ్డి సందర్శించారు.

గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతం

బీఎస్పీ మండల అధ్యక్షుడు అనంతయ్య

కొందుర్గు: గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తున్నామని పార్టీ జిల్లేడ్ చౌదరిగూడ మండల అధ్యక్షుడు అనంతయ్య అన్నారు. బీసీలకు రిజర్వేషన్ పెంచాలనే డిమాండ్‌తో బీఎస్పీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టింది. శనివారం ముష్టిపల్లి ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భగా నాయకులు మాట్లాడుతూ.. కోటి సంతకాల సేకరణకు గ్రామాల నుంచి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, బాలయ్య, రాధాకృష్ణ, యాదయ్య, నర్సింలు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కేశంపేట: మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ, లేమామిడి గ్రామాలకు చెందిన సూరమోని సత్తయ్య, గొస్కే పెంటమ్మలు ఇటీవల మృతి చెందారు. వారు నిరుపేద కుటుంబాలకు చెందిన వారు కావడంతో స్త్రీ,శిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి శనివారం రూ.5 వేల చొప్పున బాధితులకు ఆర్థికసాయం అందజేశారు. పాపిరెడ్డిగూడ గ్రామానికి చెందిన సత్తయ్యకు భజన మండలి సభ్యులు రూ.7,200ల ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో జంగయ్య, లక్ష్మయ్య, యాదయ్య, శంకర్, బాలయ్య, బాలరాజ్, సుధాకర్, జహంగీర్, ఎంకయ్య, పర్వతాలు, కావలి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై పడ్డ వారిని తప్పించబోయి..

రాజేంద్రనగర్: బైక్ పై నుంచి కిందపడ్డ వారిని తప్పించబోయి కారును సడన్ బ్రేక్ వేయడంతో వెనక వస్తున్న మూడు కార్లు ఒకదానికి ఒకటి ఢీకొని ఐదుగురికి గాయాలైన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శనివారం సాయంత్రం వ్యవసాయ వర్సిటీ ప్రధాన రహదారిపై ఓ ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇరువురిని ఓ కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు రోడ్డుపై పడ్డారు. వారి వెనకాలే వస్తున్న మరో కారు కిందపడ్డ వారిని చూసి ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో దాని వెనకాల వసుత్న్న మరో మూడు కారు ఢీకొట్టుకున్నాయి. ఈ సంఘటనలో పలు కార్లు ధ్వంసం కాగా వాటిలో ఉన్న ఐదుగురికి గాయాలయ్యాయి.

స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరికలు

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రజలు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. మండల పరిధిలోని ఎక్లాస్ఖాన్‌పేట గ్రామంలోని ఎమ్మెల్యే స్వగృహంలో శనివారం బైర్కాన్‌పల్లికి చెందిన వివిధ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి శ్రమించిన వారికి భవిష్యత్‌లో తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. బీఆర్‌ఎస్ అమలు చేస్తున్న ప్రథకాలను ప్రతీ ఒక్కరికి వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్ యాదవ్, సర్పంచ్ కృష్ణయ్య, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు రాంబాల్ నాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, యాదగిరిరావు, అంజిరెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



షాద్‌నగర్: 10వ వార్డులో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలో వివిధ వార్డుల్లో రూ.1.72కోట్లతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ శంకుస్థాపన చేశారు. ఫరూఖ్‌నగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రూ.55లక్షలతో, ఈశ్వర్ కాలనీలోని డబుల్ బెడ్రూం ఇళ్ల వద్ద రూ.97లక్షలతో, 10వ వార్డులో రూ.15లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు, 12వ వార్డులో రూ.5లక్షలతో నిర్మిస్తున్న అంతర్గత మురుగు కాల్వ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ నరేందర్, వైస్ చైర్మన్ నటరాజన్, కమిషనర్ వెంకన్న, మాజీ చైర్మన్ అగ్గనూరు విశ్వం, శ్రావణి, జమ్రుద్‌ఖాన్, పిల్లి శేఖర్ పాల్గొన్నారు.

శాంతి స్థాపనకే 'రన్ ఫర్ జీసస్'

ఏసీపీ కుషాల్కర్

షాద్‌నగర్‌టౌన్: శాంతి స్థాపనే రన్ ఫర్ జీసస్ కార్యక్రమం ఉద్దేశమని ఏసీపీ కుషాల్కర్ అన్నారు. ఈస్టర్ పండుగను పురస్కరించుకొని శనివారం షాద్‌నగర్ పట్టణంలో క్రైస్తవులు రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని విజయనగర్ కాలనీలో ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నుంచి పట్టణ ముఖ్య కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ కుషాల్కర్, పాస్టర్స్ అసోసియోషన్ అధ్యక్షుడు జోసఫ్ అంజన్న, ఉపాధ్యక్షుడు డేనియల్, స్వామి, దాసు, అభిషేక్, అబ్రహం, శాంత సికిందర్, స్టీఫెన్ పద్మ, జంగారెడ్డి, జ్ఞాన ప్రకాశ్, ఐజాక్, బిల్లి గ్రాహం, ఎజ్కెల్, రాజేశ్, పుల్ల శ్రావణ్, లాజరస్, రంగన్న, భాస్కర్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.



రన్ ఫర్ జీసస్‌లో పాల్గొన్న ఏసీపీ, తదితరులు

హామీల అమలులో ప్రధాని విఫలం



చేవెళ్లలో సీపీఐ నాయకుల నిరసన

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రామస్వామి

చేవెళ్ల: విభజన హామీలు నెరవేర్చడంలో విఫలమైన ప్రధాని నరేంద్ర మోదీ గోబ్యాక్ అంటూ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రామస్వామి అన్నారు. మండలకేంద్రంలో శనివారం సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రధానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వస్తే బయ్యారం ఉక్కు గనుల ఫ్యాక్టరీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీలపై చేసిన హామీలు నేరవేర్చలేదన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేకుండా చేశారని ఆరోపించారు. కృష్ణానది జలాలు పంపిణీపై మొండి వైఖరి ప్రదర్శించడంతో దక్షిణ తెలంగాణ సాగు, తాగునీరు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తూ దేశ సంపదను ఆదాని, అంబానీకి దోచి బెడుతున్నాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల సహాయ కార్యదర్శి మక్బుల్, ఎం. ప్రభులింగం, సత్యానారాయణ, సత్తిరెడ్డి, అంజయ్య, మల్లేశ్, గీత, మంజుల, మాధవి, విజయమ్మ, లత, అనసూయ, జంగయ్య, నర్సింలు, రమేశ్ తదితరులున్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయండి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్

మొయినాబాద్‌రూరల్: వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, అసెంబ్లీ ఇన్‌చార్జి కంజర్ల ప్రకాశ్ అన్నారు. శనివారం ఆయన హిమాయత్‌నగర్ చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో మండల నాయకుల, కార్యకర్తల సమావేశం అనంతరం మోదీ సభకు భారీగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్‌రెడ్డి, శ్రీరాములు, యాదయ్య, మహేందర్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీరాములు, రాజు, మల్లేశ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్‌రూరల్: బహిరంగ సభకు వెళ్తున్న బీజేపీ శ్రేణులు

చేవెళ్ల నుంచి..

చేవెళ్ల: ప్రధాని మోదీ సభకు చేవెళ్ల నుంచి శనివారం భారీ ఎత్తున బీజేపీ శ్రేణులు తరలివెళ్లాయి. చేవెళ్ల, ముడిమ్యాల, మల్కాపూర్, దేవునిఎర్రవల్లి, ఆలూరు, రావుపల్లి, అల్లవాడ, పామెన, కమ్మెట, తదితర గ్రామాలనుంచి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు వెళ్లారు. సభకు వెళ్లిన వారిలో నాయకులు అనంత్‌రెడ్డి, శర్వలింగం, సత్యనారాయణ, అల్లా శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, సత్యం, అభిలాశ్, అశోక్ లున్నారు.

ప్రధానికి సన్మానం

షాద్‌నగర్‌రూరల్: తెలంగాణ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ శనివారం హైద్రాబాద్‌కు విచ్చేశారు. వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభలో షాద్‌నగర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ టంగుటూరి విజయకుమార్ ప్రధానమంత్రి మోదీని మర్యాద పూర్వకంగా కలుసుకుని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా టంగుటూరి విజయకుమార్ ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఉద్దేశించి మోదీ జీ నమస్కార్. అని పలకరించగా విజయ్ జీ ఆప్నీ నియోజకవర్గ్ మే పార్టీ కో సమాల్ కరో అని అభినందించారు.



షాద్‌నగర్‌రూరల్: ప్రధాని మోదీని సన్మానించిన విజయ్‌కుమార్

ప్రభుత్వ అసమర్థతతోనే పేపర్ లీక్

వైఎస్సార్ టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇబ్రహీం

షాద్‌నగర్: ప్రభుత్వ అసమర్థత, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ అయిందని వైఎస్సార్ టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇబ్రహీం ఆరోపించారు. శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట టీ-సేవ్ పేరుతో వైఎస్సార్ టీపీ నేతలు రిలే దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇబ్రహీం మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ పై ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని ఆరోపించారు. గత ఎన్నికల్లో సీఎం కేసీఆర్ నిరుద్యోగులకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక హామీలు మరిచారన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణ పాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం శ్రీను, నర్సింహ, రాము, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట వైఎస్సార్ టీపీ నాయకుల రిలే దీక్షలు

మోదీకి అడుగుపెట్టే హక్కు లేదు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

శంషాబాద్: అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రాన్ని ఇబ్బందుల పాల్జేస్తున్న భారత ప్రధాని నరేంద్రమోదీకి రాష్ట్రంలో అడుగుపెట్టే నైతిక హక్కులేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ అభివృద్ధికి పైసా విడుదల చేయని ఆయనే ఇక్కడ సభలను పెట్టడం సరైంది కాదన్నారు. భారత ప్రధాని నరేంద్రమోదీ నగరానికి రాక సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో శనివారం శంషాబాద్‌పట్టణంలో నిరసన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ.. విభజన చట్టంలో ఉన్న హామీల్లో ఏ ఒక్క దానిని కూడా కేంద్ర ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. రాష్ట్రానికి ఇస్తామన్న బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, రైల్వేకోచ్ ఫ్యాక్టరీలు ఎక్కడున్నాయని ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ వ్యవస్థలను ప్రైవేటీకరణ చేయడమే లక్ష్యంగా కేంద్ర సర్కారు పనిచేస్తోందన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులు ముందుకు సాగకుండా ఇరురాష్ట్రాల మధ్యన తగాదాలను కేంద్ర సర్కారు రాజేస్తోందన్నారు.



నిరసన ర్యాలీలో పాల్గొన్న కూనంనేని సాంబశివరావు

విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలా..?

మతపరమైన రాజకీయాలు చేసే బీజేపీ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడేలా పదోతరగతి పేపర్ల లీకేజీకి కూడా కారణంగా మారడం దారుణమన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పేపర్ లీకేజీలో అడ్డంగా దొరికిపోయారని వెంటనే అతనికి శిక్షపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్ర, నాయకులు నర్సింగ్‌రావు, పర్వతాలు, అఫ్సర్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ ప్రింట్ మీడియా వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ టీయూడబ్ల్యూయూజే(ఐజేయూ) సమావేశం శనివారం మైలార్‌దేవ్‌పల్లిలోని దుర్గా కన్వెన్షన్‌లో జరిగింది. సమావేశంలో వివిధ అంశాలపై చర్చించిన అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. రంగారెడ్డి జిల్లా దాడుల నివారణ కమిటీ సభ్యులు భీమయ్య, సభ్యులు ఏ.పి. చారి, సూర్యకిరణ్, బాబురావు, పాపిరెడ్డిల పర్యవేక్షణలో ఏకగ్రీవంగా తీర్మాణించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా వి.చందు, షేక్ నిజాముద్దీన్, జాయింట్ సెక్రటరీలుగా కె.మహేష్, టి.లక్ష్మణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.ప్రేమ్‌రాజ్, స్పోర్ట్స్ సెక్రటరీగా గద్దె యాదగిరి, పబ్లిసిటి సెక్రటరీగా కె.చంద్రకాంత్, కోశాధికారిగా ఎస్.విజయ్‌కుమార్, సహాయ కోశాధికారిగా డి.ఇంద్రసేన, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా గోంగూర శ్రీనివాస్, సలహాదారులుగా డి.పాపిరెడ్డి, పి.సూర్యకిరణ్, బి.బాబురావు నియమితులైయ్యారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

రాజేంద్రనగర్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో పాలు పంచుకున్నప్పుడే విజ్ఞాన వంతులుగా ఎదుగుతారని అత్తాపూర్ రవీంద్రభారతీ పాఠశాల డీన్ ప్రియామనీష్, ప్రిన్సిపల్ సుధా వెల్లడించారు. సి.వి.రామానుజం కాంపిటేటివ్ యంగ్ జీనియస్ ఎగ్జామ్‌లో అత్తాపూర్ రవీంద్రభారతీ పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థి వర్షిత్‌రెడ్డి డిస్ట్రిక్- 2వ ర్యాంక్‌ను సాధించడంతో పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు పోటీ పరీక్షలు ఎంతగానో దోహదపడుతాయన్నారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న యువకులు

కాంగ్రెస్ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దర్శన్

మొయినాబాద్: రక్తదానం చేయడమంటే ఇతరులకు ప్రాణదానం చేయడమేనని కాంగ్రెస్ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షాబాద్ దర్శన్ అన్నారు. మొయినాబాద్‌కు చెందిన యువకుడు కావలి సిద్దు ముదిరాజ్ పుట్టినరోజు సందర్భంగా సిద్దన్న యువసేన ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. నగరంలోని ప్రీమియర్ వాలంటరీ బ్లడ్ బ్యాంక్‌కు 25 మంది రక్తదానం చేశారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన దర్శన్ మాట్లాడుతూ.. రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలను నిలబెట్టడానికి యువత ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, రవీందర్‌గౌడ్, యువకులు రామకృష్ణ, ఆంజనేయులు, నర్సింహచారి, సతీశ్, రాజేశ్, నవీన్, తరుణ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులకు గృహిణి బలి

రాజేంద్రనగర్: అదనపు కట్నం కోసం తమ కూతురును వేధించి హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారంటూ కర్ణాటకకు చెందిన దంపతులు అత్తాపూర్ ఔట్‌పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ కూతురును చంపడంతో పాటు కేసును వాపసు తీసుకోవాలని బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ వివరాల ప్రకారం.. అత్తాపూర్‌కు చెందిన రత్నదీప్(28) వివాహం కర్ణాటక బీదర్‌కు చెందిన నందిని(24)తో రెండేళ్ల క్రితం జరిగింది. వివాహ సమయంలో 8 తులాల బంగారం, ఐదు లక్షల కట్నం ఇచ్చి ఘనంగా పెళ్లి జరిపించారు. వివాహం జరిగిన కొన్నిరోజులకే రత్నదీప్ అదనపు కట్నం కోసం భార్యను వేధించేవాడు. గత నెల రోజులుగా కొత్తగా ప్లాట్ కొనుగోలు చేస్తున్నామని డబ్బులు తీసుకురావాలంటూ రత్నదీప్‌తో పాటు అత్తా మామా విజయ, లక్ష్మణ్‌రావులు సైతం వేధించారు. ఈ నెల 6వ తేదీన రత్నదీప్ బీదర్‌లోని నందిని తల్లిదండ్రులకు ఫోన్‌చేసి నందిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందంటూ సమాచారం అందించారు. హుటాహుటిన తల్లిదండ్రులు నగరానికి చేరుకున్నారు. 7వ తేదీ ఉస్మానియా మార్చురీలో మృతదేహాన్ని పరిశీలించగా ఒంటిపై గాయాలు ఉండడంతో అదనపు కట్నం కోసమే అత్తింటి వారు వేధించి హత్య చేశారని నిర్ధారించుకుని దహన సంస్కారాలు పూర్తి చేశారు. శనివారం ఉదయం అత్తాపూర్ ఔట్‌పోస్టు పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా కేసును నమోదు చేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలిసా పఠనం

రాజేంద్రనగర్: ఉప్పర్‌పల్లి చైతన్య విల్లాస్ కాలనీ రామాలయంలో హనుమాన్ చాలీసా పఠనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెలంగాణ మాతృశ్రీ బాల సంస్కార కేంద్రం ఆధ్వర్యంలో 45 రోజుల పాటు హనుమాన్ చాలిసా పటన కార్యక్రమాన్ని నిర్వహించారు. రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగేలా నిర్వహిస్తున్న నిర్వహకులు తెలిపారు. శనివారం సాయంత్రం దేవాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వనితారెడ్డి, పద్మశ్రీ, కనకదుర్గా, సుభాష్, వెంకటలక్ష్మి, మంజుల, సునంద తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్ చాలీసా పఠిస్తున్న భక్తులు

ముందస్తు అరెస్టులు సరికాదు

యూత్ కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షుడు పెంటారెడ్డి

షాబాద్: ప్రధాని పర్యటన నేపథ్యంలో ప్రతిపక్ష నాయకులను ముందస్తు అరెస్టు చేయడం సరికాదని చేవెళ్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గూడుపల్లి పెంటారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం సీఐ గురువయ్య గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి స్టేషన్‌కు తలరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి పనులు ప్రారంభించాలంటే ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయాలనే నిబంధన పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేక రాష్ట్రంలోనే నిర్బంధం పెరిగిందని మండిపడ్డారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఎంపీటీసీ సభ్యుడు అశోక్, మాజీ సర్పంచ్ శేఖర్, పార్టీ నాయకులు రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, జంగయ్య, శేఖర్, శ్రీనివాస్, ఆంజనేయులు, రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.



షాబాద్ పీఎస్‌లో కాంగ్రెస్ నాయకులు

అరెస్టులతో పోరాటాన్ని ఆపలేరు

చేవెళ్ల: ప్రధాని పర్యటన కారణంగా పోలీసులు కాంగ్రెస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేసి స్టేషన్‌కు తరలించారు. శనివారం ఉదయం ఎక్కడిక్కడ పార్టీ నాయకులను అరెస్ట్ చేయటంపై ఆ పార్టీ నాయకులు తీవ్రంగా మండిపడుతున్నారు. అమరవీరులను అవమానించిన మోదీ రాష్ట్ర ప్రజలకు క్షమాపన చెప్పాకే రాష్ట్రంలో పర్యటించాలని డిమాండ్ చేశారు. చేశారు. అరెస్టులు చేసినంత మాత్ర పోరాటాలు ఆగవన్నారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో టీపీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి గుండాల రాములు, ఉపాధ్యాక్షుడు పాండుయాదవ్, మల్లేశ్‌యాదవ్, డీసీసీ నాయకులు పెంటయ్యగౌడ్, చేవెళ్ల ఉప సర్పంచ్ గంగి యాదయ్య తదితరులు ఉన్నారు.

వంతెన పనుల పరిశీలన



వంతెన కోసం సర్వే చేస్తున్న అధికారులు

శంషాబాద్ రూరల్: మండలంలోని పిల్లోనిగూడ-మక్తగూడ వద్ద ఎంటీరువాగుపై చేపట్టిన వంతెన పనులను శనివారం పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు పరిశీలించారు. ఇక్కడ చేపట్టిన నిర్మాణ పనులు గత కొన్ని నెలలుగా నిలిచిపోయాయి. ఇదిలా ఉండగా.. సుల్తాన్‌పల్లి-కేబీ.దొడ్డి గ్రామాల మధ్యలో ఎంటీరువాగుపై ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరడంతో కొత్త వంతెన నిర్మాణం కోసం నిధులు మంజూరు అయ్యాయి. ఈ పనుల కోసం అధికారులు సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సంగీతసిద్దేశ్వర్, వార్డు సభ్యులు చంద్రశేఖర్, స్థానికులు విక్రమ్, రాజు, రాఘవేందర్, కుమార్, అనిల్, నర్సింహా, జుర్కి రమేష్ పాల్గొన్నారు.